2వ పాఠం జూలై 4-10

# ప్రేరేపణ కలిగించు సాక్ష్యములు: వ్యక్తిగత సాక్ష్యమునకున్న బలము

## సబ్బాతు మధ్యాహ్నము జూలై 4

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : మార్కు 5:15-20; 16:1-11, అపొ॥కా॥ 4:1-20; 1యోహాను 1:1-3; గలతి 2:20; అపొ॥కా 26:1-32.**

**కంఠతవచనం : "మేము కన్న వాటిని విన్నవాటిని చెప్పకయుండలేమని వారికి ఉత్తరమిచ్చిరి" (అపొ॥కార్య 4:20).**

ఒకని వ్యక్తిగత సాక్ష్యములో అసాధారణమైన శక్తి ఉంటుంది. మన హృదయములు క్రీస్తు యొక్క ప్రేమ ద్వారా ఉత్తేజము పొంది ఆయన కృప ద్వారా మార్పు చెందినప్పుడు ఆయనను గూర్చి వివరించుటకు మనకు కొంత ప్రాధాన్యత ఏర్పడుతుంది. యేసు ఇతరులకు ఏమి చేసాడో అనే విషయాలను గూర్చి చెప్పడం ఒక విధముగా ఉంటుంది. అదే సమయములో ఆయన మనకు వ్యక్తిగతముగా ఏమి చేసాడో అనే విషయాలను గూర్చి చెప్పడం వేరే విధముగా ఉంటుంది.

వ్యక్తిగత అనుభవమునకు వ్యతిరేకముగా వాదించడము కొంచెము కష్టమైన విషయమే. మీరు బైబిలు వాక్యాలను వివరించేటప్పుడు లేక బైబిలు వేదాంతమును గూర్చి చర్చించేటప్పుడు అనేక మంది అనేక రీతులలో మీరు చెప్పే విషయాలను సమర్ధించవచ్చును లేక వ్యతిరేకించవచ్చును. కొన్ని సందర్భాలలో పరిహాసము చేయవచ్చు. అయితే ఒక వ్యక్తి తనను గూర్చి తాను ఇతరులతో సంబంధము లేకుండా ఈ క్రింది విధముగా చెప్పవచ్చును. ఒకప్పుడు నేను నిరీక్షణ లేని వానిగా ఉన్నాను కాని ఇప్పుడైతే నాకు నిరీక్షణ ఉన్నది. ఒకప్పుడు అపరాధ భారముతో నిండియుండెడివాడను. ఇప్పుడైతే నాకు శాంతి ఉన్నది. ఒకప్పుడు గురిలేనివానిగా ఉంటిని. ఇప్పుడైతే నాకు గురి వుంది. "ఈ విధముగా శక్తినిగూర్చి వ్యక్తిగత అనుభవముతో మాట్లాడినపుడు చివరికి నాస్తికులు లేక విశ్వాసహీనులపై కూడా దాని ప్రభావము చూపిస్తుంది".

అపొస్తలుడైన పౌలు దమస్కు మార్గములో అకస్మాత్తుగా మరియు ఊహించనిరీతిలో మారుమనస్సు పొందినట్లు కొంతమందికి అనుభవము కలుగవచ్చును. యేసు ఉచితముగా అనుగ్రహించు రక్షణను బట్టి ఒక ఉన్నతమైన కృతజ్ఞత భావము ఆయన యెడల ఏర్పడుటవలనను ఆశ్చర్యకరమైన ఆయన కృపను బట్టి ఒక లోతైన ప్రశంస భావము కలుగుటవలనను యేసు యొక్క అమూల్యమైన జ్ఞానములో ఎదుగుట వలనను ఒక వ్యక్తిలో మారుమనస్సు కలుగవచ్చును. క్రీస్తు మానవ జీవితములకు స్పష్టతను ఇస్తాడు. ఇటువంటి బలమైన సాక్ష్యముల కొరకు లోకము ఎదురుచూస్తున్నది. దానికి అవసరమై యున్నది.

– జూలై 11, సబ్బాతు దినమున ఈ పాఠమును అధ్యయనము చేయుటకు ఈ వారమంతయు చదువుడి.

**ఆదివారం** **జూలై 5**

## బహు అరుదుగా సంభవించే సాక్ష్యములు

**మార్కు 5:15–20 చదువుడి. యేసు ఆ మనుష్యుని తన యొద్దనే పెట్టుకొని అతనికి కలిగిన నూతన విశ్వాసము విషయములో లోతైన సంగతులను బోధించుటకు బదులు అతనిని తన స్నేహితులకు మరియు తన కుటుంబ సభ్యులకు సాక్ష్యమివ్వవలెనని డెకపోలీస్‌కు ఎందుకు పంపించెను?**

-----------------------------------------------

-----------------------------------------------

డెకపోలీస్ అనే మాట రెండు మాటల కలయికతో ఏర్పడినది. 'డెక' అనగా పది మరియు 'పోలీస్' అనగా పట్టణము అని అర్థము. మొదటి శతాబ్దము కాలములో గలిలయ సముద్ర తీర ప్రాంతములో డెకపోలిస్ అనే ప్రాంతము పది పట్టణములను కలిగియున్నది. ఆ పట్టణాలన్నియు ఒకే భాష మరియు ఒకే సంస్కృతిలో ఏర్పడియున్నవి. ఆ ప్రాంతములో సేన అను దయ్యములు పట్టిన వాడిని గూర్చి అక్కడి ప్రజలందరికి తెలుసు. ఊహకందని మరియు హింసాత్మకమైన ప్రవర్తనతో అతడు ఆ ప్రాంతపు ప్రజలలో భయాందోళనలను కలిగించెను. అయితే అతనిలో ఏదో ఒక మంచి విషయము కొరకు ఆశపడుచున్నట్లు యేసు చూచి అతనిని పట్టి పీడించుచున్న దయ్యముల బారి నుండి ఒక అద్భుత రీతిలో విడిపించాడు.

యేసు ఆ దయ్యములను అతనిలో నుండి తోలి వేసి పందులలో ప్రవేశించునట్లు ఆజ్ఞ ఇయ్యగా ఆ దయ్యములు పందులలో ప్రవేశించగా ఆ మంద కొండ శిఖరము నుండి సముద్రములోనికి దూకి ఊపిరాడక చచ్చెను. ఆ విషయమును తెలుసుకున్న పట్టణ ప్రజలు అక్కడ జరిగిన సంగతులను తెలుసుకొనుటకు గుమికూడి వచ్చిరి. జనులు జరిగినది చూడ వెళ్ళి యేసు నొద్దకు వచ్చి సేన అను దయ్యము పట్టినవాడు బట్టలు ధరించుకొని స్వస్థచిత్తుడై కూర్చొనియుండుట చూచి భయపడిరి" (మార్కు 5:15). అని మార్కు సువార్త వివరించుచున్నది. ఆ మనుష్యుడు భౌతికముగాను, మానసికముగాను, భావావేశముగాను, ఆధ్యాత్మికముగాను స్వస్థపర్చబడి యున్నాడు. మనుష్యులు పాపము వలన కోల్పోయిన పరిపూర్ణతను క్రీస్తు తిరిగి వారిలో పునరుద్ధరించే చర్యయే సువార్త యొక్క సారాంశమైయుంది.

దయ్యములతో పీడింపబడిన ఒక వ్యక్తి వాటి బారి నుండి విముక్తి పొందినవాడై పరివర్తన చెంది డెకపోలిస్ ప్రాంతములో ఉన్న ఆ పది పట్టణాలకు తన సొంత సాక్ష్యమును ప్రకటించుటకు వెళ్లి యుండగా ఆ విధమైన సేవ చేయుటకు అతనికి మించిన వ్యక్తి ఇంకొక వ్యక్తి ఎవరైనా ఉంటారా? ఎలెన్ జి వైట్ ఈ విధముగా చెప్పియున్నారు "క్రీస్తుకు సాక్షులుగా మనకు ఏమి తెలిసినదో, మనము ఏమి చూచితిమో, అనుభవించితిమో ఆ విషయాలను మనము ప్రకటించవలసియున్నది. యేసు యొక్క అడుగుజాడలను మనము అనుసరించుచున్నయెడల ఆయన మనలను ఏవిధముగా నడిపించెనో ఆ విషయాలను సక్రమమైన రీతిలో ఇతరులకు చెప్పుటకు మనకు సమర్థత కలుగుతుంది. ఆయన వాగ్దానములను మనము ఏవిధముగా పరీక్షించామో మరియు అవి ఏవిధముగా నెరవేరినవో అనే విషయాలను ఇతరులకు చెప్పవచ్చును. క్రీస్తు యొక్క కృపను గూర్చి మనకు ఏమి అర్థమైనదో

దానిని గూర్చి మనము సాక్ష్యమివ్వవచ్చును. అట్టి సాక్ష్యమిచ్చుట కొరకే ప్రభువు మనలను పిలిచియున్నాడు. అటువంటి సాక్ష్యాలు లేనందువలననే లోకమునశించిపోవుచున్నది. –యుగయుగాల ఆకాంక్ష పుట 340. మనము జీవిస్తున్న ఈ లోకములో మార్పును చూపించుట కొరకు ఆయన కృప ద్వారా మార్పు చెందిన మరియు బహు అరుదుగా సంభవించే సాక్ష్యములను దేవుడు తరుచుగా ఉపయోగించుకుంటూ ఉంటాడు.

**నీ స్వంత వృత్తాంతము ఏమైయున్నది? అనగా నీవు ఏవిధముగా మారుమనస్సు పొందావు? నీవనుసరిస్తున్న ఈ విశ్వాసములోనికి ఏవిధముగా వచ్చి యున్నావు? నీవు ఇతరులతో పంచుకొనే అనుభవము ద్వారా వారు మేలు పొందునట్లు మారుమనస్సు పొందని వారికి నీవేమి ఇవ్వగలవు?**

## సోమవారం జూలై 6

## పునరుత్తానుడైన క్రీస్తును ప్రకటించుట

ఆదివారము పెందలకడనే ఇద్దరు మరియలు క్రీస్తు యొక్క సమాధి యొద్దకు వేగముగా వెళ్ళిరి. ఆయనను ఏదైనా విషయాన్ని అడుగుటకు వెళ్ళుటలేదు. సాధారణముగా మరణించిన ఒక వ్యక్తి ఎవరికైనా ఏమివ్వగలడు? ఆయనను వారు చివరిసారిగా చూచినప్పుడు ఆయన దేహమంతయు రక్తముతో కప్పబడి నలుగగొట్టబడియున్నది. వారి మనస్సులలో ఆయన మోసిన సిలువ యొక్క దృశ్యములు చాలా లోతుగా నాటుకొనియున్నవి. ఇప్పుడు వారి యొక్క విధిని నెరవేర్చుటకు సిద్దపడుచున్నారు. ఆయన దేహమునకు పూయవలెనని సుగంధ ద్రవ్యములను కొని దుఃఖముతో సమాధి యొద్దకు వెళ్ళిరి. నిరాశ అనే చీకటి ఛాయలు వారి జీవితాలను ఆవరించియున్నవి. వారి భవిష్యత్తు అగమ్యగోచరముగా ఉన్నది. వారు సమాధి యొద్దకు వెళ్ళినపుడు అది ఖాళీగా ఉండుట గమనించి ఉలిక్కిపడ్డారు. పునరుత్తానము చెందిన ఆ ఉదయమున సంభవించిన సంఘటనలను మత్తయి ఈ విధముగా వ్రాసియున్నాడు. దూత ఆ స్త్రీలను చూచి – మీరు భయపడకుడి. సిలువ వేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును. ఆయన ఇక్కడ లేడు. తాను చెప్పినట్లే ఆయన లేచియున్నాడు" (మత్తయి 28:5,6).

ఆ స్త్రీలు ఇప్పుడు సంతోషముతో మునిగియున్నారు. విచారమనే వారి నల్లని మేఘములు ఉదయమున వెలువడే సూర్యకాంతి వలె మార్పు చెందియున్నవి. విచారముతో నిండియున్న వారి రాత్రి సమయము గడిచిపోయినది. వారి ముఖముల మీద ఆనందము చాలా తేటగా కనిపించుచున్నది. కన్నీళ్ళతో గడిపిన వారి దుఃఖ సమయములు ఇప్పుడు ఆనందముతో స్తుతిగానములు చెల్లించే సమయముగా మార్పుచెందినది.

**మార్కు 16:1-11 చదువుడి. మృతులలో నుండి క్రీస్తు పునరుత్తానుడయ్యాడనే విషయాన్ని కనుగొన్నపుడు మరియ యొక్క స్పందన ఏ విధముగా ఉన్నది?**

--------------------------------------------

--------------------------------------------

పునరుత్తానుడైన క్రీస్తును మరియ కలుసుకున్నపుడు ఆ వృత్తాంతమును ప్రకటించుటకు ఆమె వేగముగా పరుగెట్టినది. శుభవార్త ఇతరులతో పంచుకొను నిమిత్తము ఏర్పాటు

చేయబడినది. అందుచేత ఆమె నెమ్మదిగా ఉండలేకపోయినది. క్రీస్తు సజీవుడయ్యాడు. ఆయన సమాధి ఖాళీగా ఉన్నది. ఈ విషయమును లోకము తెలుసుకొనవలసియున్నది. మన జీవిత పయనములో పునరుత్తానుడైన క్రీస్తును కలుసుకొనినప్పుడు మనము కూడా పరుగెత్తుకొని వెళ్లి లోకమునకు చాటించవలసియున్నది. శుభవార్త అనునది పంచుకొనెడిది కాబట్టి మనము ఇతరులతో పంచుకొనవలసియున్నాము.

యేసు ప్రతిసారి తన శిష్యులతో తనకు ఏమి సంభవింపబోవుచున్నదో ఆయన ఏవిధముగా చంపబడబోవుచున్నాడో తరువాత ఏవిధముగా పునరుత్థానుడు కాబోవుచున్నాడో అదే విషయాలను చెప్పియున్నప్పటికి మరియ ఇచ్చిన సాక్ష్యమును వారు నమ్మలేదు. చివరికి ఆ వార్త వారికి ఒక భ్రమగా మారిపోయినది. ఆమె వెళ్ళి ఆ సంగతివారికి తెలియజేసెను గాని ఆయన బ్రతికియున్నాడనియు ఆమెకు కనబడెననియు వారు విని నమ్మకపోయిరి" (మార్కు 16:11) ఆమె యొక్క మాటలను యేసుని సొంత శిష్యులే వెంటనే నమ్మనియెడల మన మాటలను కూడా ఇతరులు తక్షణమే నమ్మకపోయినను మనము ఆశ్చర్యము పడనవసరములేదు.

**నీవిచ్చిన సాక్ష్యమును త్రోసివేసిన చివరిసారి ఎప్పుడు?దానికి నీవు ఏవిధముగా స్పృశించియున్నావు మరియు ఆ అనుభవమునుండి నీవేమి నేర్చుకొనియున్నావు?**

## మంగళవారం జూలై 7

## మార్పు చెందిన జీవితములు తేడాను చూపిస్తాయి

**వారు పేతురు యోహానుల ధైర్యమును చూచినప్పుడు వారు విద్యలేని పామరులనిగ్రహించి ఆశ్చర్యపడి వారు యేసుతో కూడా ఉండిన వారని గుర్తెరిగిరి. (అపొ॥కార్య 4:13).**

నూతన నిబంధన క్రైస్తవ సంఘము ఊహించనంతగా పెరిగిపోయింది. పెంతుకోస్తు దినమున 300ల మంది బాప్తిస్మము పొందియున్నారు (అపొ॥ 2:4). కొన్నివారముల తరువాత మరికొన్ని వేల మంది సంఘములోనికి చేర్చబడిరి (అపొ॥కా 4:4). త్వరలోనే అక్కడ ఏమి సంభవిస్తున్నదో అధికారులు గుర్తించగలిగారు. ఈ నూతన నిబంధన విశ్వాసులు క్రీస్తుతో ఉన్న వారై యున్నారు. వారి జీవితాలు మార్పు చేయబడినవి. ఆయన కృపను బట్టి వారు మారుమనస్సు పొందారు మరియు వారు నిశ్శబ్దముగా ఉండలేకపోయారు.

**అపొ॥కార్య 4:10 చదువుడి. ఇక్కడ ఏమి సంభవించినది? అధికారులు ప్రయత్నించినపుడు ఏమి సంభవించినది? వారి యొక్క స్పందన ఏమైయున్నది?**

-------------------------------------------------

-------------------------------------------------

ఆ విశ్వాసులు క్రీస్తునందు క్రొత్తవారు. అందుచేత వారి వృత్తాంతములను తెలియపర్చవలసియున్నది. పేతురు బిగ్గరగా మాట్లాడే నోరు కలిగిన జాలరి. అతను దేవుని యొక్క కృపను బట్టి మారుమనస్సు పొందియున్నాడు. ఉరిమెడు వాని కుమారులని పిలువబడిన యాకోబు మరియు యోహానుల యొక్క స్వభావము కఠినముగా ఉండుట వలన వారిని అదుపు చేయుట కష్టముగానే ఉండెడిది. అయితే అటువంటి వారు సహితము దేవుని కృపను బట్టి మారుమనస్సు పొందియున్నారు. అనుమానమును వ్యక్తపర్చే తోమా

దేవుని యొక్క కృపనుబట్టి మారుమనస్సు పొందాడు. శిష్యులు మరియు ఆదిమ క్రైస్తవ సంఘ సభ్యులలో ప్రతివారు ఒక్కొక్క వృత్తాంతము కలిగిన వారే. వారందరు నిశ్శబ్దముగా కూర్చొనియుండలేకపోయేవారు. "క్రీస్తు యొద్దకు మెట్లు" అనే పుస్తకములో ఎలెన్ జి వైట్ శక్తివంతమైన మాటలను వ్రాసియున్నది. "ఒకరు క్రీస్తు యొద్దకు వచ్చిన వెంటనే యేసులో ఆ వ్యక్తి కనుగొనిన ఒక విలువైన స్నేహితుని గూర్చి ఇతరులతో చెప్పకుండా ఉండలేనట్టి ఒక నూతన కోరిక వారి హృదయములో ఉద్భవిస్తుంది. రక్షించే మరియు పరిశుద్ధ పరచే సత్యము అతని హృదయములో బందీగా ఉండలేదు" – పుట 78.

అపొ॥కా॥ 4:16లో మత నాయకులు ఏమి చెప్పియున్నారో ఒకసారి గమనించుడి. వారి ముందు స్వస్థపర్చబడిన మనుష్యుడు నిలువబడియుండుట చూచి బహిరంగముగానే అక్కడ సంభవించిన అద్భుత కార్యమును వారు చూచియున్నారు. అయినప్పటికి వారి యొక్క వైఖరిని మార్చుకొనుటకు వారు నిరాకరించి యున్నారు. ఆ విధముగా బహిరంగముగానే వారు ఒప్పుకొనకపోయినను పేతురు మరియు యోహాను వారిచ్చే సాక్ష్యము విషయములో వెనుకడుగు వేయలేదు.

**క్రీస్తును ఎరుగుట మరియు క్రీస్తును గూర్చి సాక్ష్యమిచ్చుట లేక పంచుకొనుట మధ్య ఉన్న బాంధవ్యము ఏమిటి? ఆయనను గూర్చి సాక్ష్యమిచ్చుటకు క్రీస్తును వ్యక్తిగతముగా తెలుసుకొనుట ఎందుకు అవసరమైయుంది?**

**బుధవారం** **జూలై 8**

## మన అనుభవము పంచుకొనుట

అపొ॥కా 26లో ఒక ఖైదీగా రాజైన అగ్రిప్ప యెదుట అపొస్తలుడైన పౌలు నిలువబడియుండుట మనము చూస్తున్నాము. ఇక్కడ పౌలు యేసు యొక్క అనుచరులను ఏవిధముగా హింసించాడో తన వ్యక్తిగత సాక్ష్యమును రాజునకు వివరించుటయే గాక తాను మారుమనస్సు పొందిన తరువాత యేసుకు సాక్షిగాను మరియు మృతుల యొక్క పునరుత్థాన వాగ్దానమును గూర్చి కూడా ఆయన ప్రకటించుచున్న విషయాలన్నింటిని వివరించియున్నాడు. (అపొ॥కార్య 26:8).

దమస్కు మార్గములో పౌలు మారుమనసు పొందినప్పుడు మన ప్రభువు ఆయనతో మాట్లాడుతూ "నీవు నన్ను చూచియున్న సంగతిని గూర్చియు, నేను నీకు కనబడబోవు సంగతిని గూర్చియు నిన్ను పరిచారకునిగాను సాక్షినిగాను నియమించుటకై కనబడియున్నాను" (అపొ॥కార్య 26:16). మన విశ్వాసమును ఇతరులతో పంచుకొనుట అనునది ఎల్లపుడు ఒక క్రియాశీల అనుభవమైయున్నది. గత కాలములో క్రీస్తు మనకు ఏమి చేసియున్నాడో మన జీవితములలో నేడు ఆయన ఏమి చేయుచున్నాడో మరియు భవిష్యత్తులో మన కొరకు ఆయన ఏమి సంపాదించిపెట్టి యున్నాడో అనే విషయాలన్నింటిని గూర్చి సాక్ష్యము వివరిస్తుంది.

మన గురించి చెప్పడమనునది ఎన్నడు సాక్ష్యమనబడదు. సాక్ష్యమనగా అది ఎల్లపుడు క్రీస్తును గూర్చినదైయుండాలి. మన దోషాలను క్షమించువాడు మన రోగములను స్వస్థపరచువాడు. దయతో కూడిన ప్రేమతో మనలను కప్పువాడు, మంచి విషయాలతో

మనలను తృప్తిపరచువాడు. ఇవన్నియు కూడా మన యెడల నెరవేర్చువాడు ఆ దేవుడే (కీర్తన 103:3-5). మన యెడల ఆయన యొక్క ఆశ్చర్యకరమైన కృప కలిగిన దేవునితో మనము వ్యక్తిగతముగా ఊహించని రీతిలో ఆయనతో ఎదురైన సంఘటనలను గూర్చి వివరించుటయే సాక్ష్యమనబడును.

**1యోహాను 1:1-3 చదువుడి. మరియు దానిని గలతి 2:20తో పోల్చి చూడుడి. ఈ వాక్యాల మధ్య నీకు కన్పిస్తున్న పోలిక లేమిటి? యోహాను యొక్క అనుభవము ఏవిధంగా పౌలు యొక్క అనుభవమువలె ఉన్నది?**

--------------------------------------------

--------------------------------------------

యోహాను మరియు పౌలు యొక్క జీవిత అనుభవాలు వేర్వేరుగా ఉన్నప్పటికి ఇరువురికి కూడా క్రీస్తుతో అనుకోని సమావేశమును వ్యక్తిగతముగా వేర్వేరుగా ఎదుర్కొని యున్నారు. ఆ సమావేశము ఏదో ఒకసారి వారి గత జీవితములో సంభవించినది కాదు. అది వారి అనుదిన జీవితములో ఆయన ప్రేమయందు ఆనందించుచు ఆయన సత్యమనే వెలుగులోనడుచుట ద్వారా సంభవించే అనుభవమైయున్నది. వారి జీవితములో ఆవిధముగా నిరంతరము జరిగియున్నది.

మారు మనస్సు పొందడమనునది కేవలము ఒకని గత జీవితానికి సంబంధించినదేనా? గత కాలములో వారికి కలిగిన మనస్సు అనుభవమే ప్రధానము అని అనుకునే వారిని గూర్చి ఎలెన్ జి వైట్ చెప్పిన విషయాన్ని ఒకసారి పరిశీలించండి. "ఏదో ఒక్కసారిగానే మతమును గూర్చి సంపూర్ణముగా తెలిసిపోయినట్లు వారికి ఇక అనుదినము మారుమనస్సు పొందనవసరములేదని కొందరు భావిస్తారు. అయితే అది సరియైన ఆలోచన కాదు. మనలో ప్రతివాడు ప్రతిదినము మారుమనస్సు పొందవలసియున్నాము" విడుదల చేయబడిన చేవ్రాతప్రతులు, సంపుటి 4 పుట 46.

**మీ పాత అనుభవము ఎటువంటిదైనప్పటికి అది శక్తివంతమైనది మరియు ఆకస్మికముగా సంభవించినప్పటికి ప్రభువు యొక్క శక్తిని ఆయన మంచితనమును మరియు ఆయన సత్యమును గ్రహించుటకు ఆయనతో అనుదినము బాంధవ్యము కలిగియుండుట ఎందువలన అంత ప్రాధాన్యమైన విషయమైయున్నది? సబ్బాతు దినము నాటికి మీ జవాబును తీసుకొని రండి.**

## గురువారం — జూలై 9

## ఒక వ్యక్తిగత సాక్ష్యమునకున్న శక్తి

పౌలు రాజైన అగ్రిప్ప సభలో నిలిచియున్న దృశ్యమును మరొకసారి పరిశీలిద్దాము. యూదా రాజుల వరుస క్రమములో హేరోదు గృహమునకు చెందిన మెకబీయులలో చివరివాడు రాజైన ఈ అగ్రిప్ప. ఇతడు ఒక యూదుడుగా ప్రకటించుకున్నను తన హృదయమంతయు ఒక రోమీయునివలెనె ఉంటుంది ఎస్‌డిఎ బైబిలు వ్యాఖ్యానము సంపుటి 6 పుట 436 చూడుడి.

ముసలివాడైన అపొస్తలుడు తాను చేసిన సువార్త యాత్రలలో అలసిపోయిన వాడైయున్నాడు. మరియు మంచి చెడుకు మధ్య జరుగుచున్న పోరాటములో భయపడుచున్నను అతని హృదయము దేవుని యొక్క ప్రేమతో నింపబడుట వలనను మరియు దేవుని యొక్క మంచితనము వలన అతని ముఖము ప్రకాశమానముగా ఉన్నది. తన జీవితములో ఏమి

సంభవించినను దేవుడు మంచివాడు అని మాత్రమే అతడు ప్రకటిస్తాడు.

ఏదైనా విలువలతో కూడిన వ్యవస్థ ఉన్నట్లయితే దానికి విరుద్ధంగా ఉండేవాడని అగ్రిప్పను గూర్చి చెప్పడం జరిగింది. అతడు చిరు బుర్లాడే స్వభావము కలిగినవాడు. ప్రతి విషయాన్ని సందేహించువాడు క్రూరత్వముగా వ్యవహరించువాడునైయున్నాడు. అట్టి వ్యక్తి యెదుట నిలువబడిన పౌలు మాత్రము విశ్వాసముతో నింపబడిన వాడై సత్యమునకు కట్టుబడిన వాడును మరియు నీతిని ధర్మమును సంరక్షించుటకు ధైర్య స్థైర్యాలున్న వ్యక్తిగా పేరు మోసినవాడుగా ఉన్నాడు. ఈ విచారణ సమయములు విరుద్ధ మనస్తత్వాలు కలిగిన ఇద్దరు వ్యక్తులు అక్కడున్నారు. పౌలు మాట్లాడుటకు అగ్రిప్ప యొద్ద నుండి అనుమతిని కోరగా అది అతనికి లభించెను.

**అపొ॥కార్య 26:1-32 చదువుడి. అగ్రిప్పకు పౌలు ఏవిధముగా సాక్ష్యమిచ్చాడు. అతని మాటల నుండి మనము నేర్చుకొనవలసినదేమిటి?**

---------------------------------------------

---------------------------------------------

కఠినముగా ఉండుట వలన హృదయములు మూయబడును. దయ కలిగి యుండుట వలన హృదయములు తెరవబడును. ఇక్కడ పౌలు అగ్రిప్ప యెడల నమ్మరాని విధముగా కనికరము కలిగియున్నాడు. అతనిని యూదుల యొక్క ఆచార వ్యవహారాలన్నిటియందు ఆరితేరిన వానిగా గుర్తించి (అపొ॥కా॥ 26:3) పౌలు తనకు కలిగిన మారుమనస్సును గూర్చి వివరముగా అగ్రిప్ప ఎదుట వివరించుచున్నాడు.

**అపొ॥కార్య 26:12-18లో వ్రాయబడినట్లు పౌలు మారు మనస్సు పొందిన విధానమును గూర్చి చదువుడి. మరియు అది అగ్రిప్ప మీద చూపించిన ప్రభావమును గూర్చి అపొ॥కార్య 26:26-28లో చదువుడి. అగ్రిప్ప ప్రతిస్పందించిన విధానమునకు కారణమేమైయుంటుందని నీవు అనుకొనుచున్నావు? పౌలు ఇచ్చిన సాక్ష్యములో ఏవిషయాలు అతనిని ప్రభావితము చేసినవి?**

---------------------------------------------

---------------------------------------------

యేసు పౌలు జీవితమును ఏవిధముగా మార్పు చేసాడో తెలియచేసే అతని సాక్ష్యము దేవుని ఎరుగనట్టి రాజు మీద గొప్ప ప్రభావమును చూపెను. మారుమనస్సు పొందుట ద్వారా మార్పు చెందిన జీవితమునకు సంబంధించిన సాక్ష్యమునకు మించినది మరొకటి ఉండదు. అది ఇతరులలో గొప్ప మార్పును తీసుకొని రాగలదు. దేవుని కృప ద్వారా మార్పు చెందిన జీవితాలు దేవుని నమ్మని రాజులను సహితము కదిలించగలదు. పౌలు వంటి గొప్ప ఆసక్తికరమైన సాక్ష్యము మన జీవితాలలో లేకున్నా మనమందరము క్రీస్తు యొక్క రక్తము ద్వారా ఏవిధంగా విమోచింపబడగలమో ఇతరులకు చెప్పగలిగే స్థితిలో మనముండాలి.

**శుక్రవారం** **జూలై 10**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్ వ్రాసిన అపొస్తలుల కార్యములు అనే పుస్తకములో నుండి "నీవు నన్ను

అంత సులువుగా క్రైస్తవునిగా చేయాలనుకొనుచున్నావే" అనే వ్యాసమును చదువుడి. పుటలు 433-438.

యేసుతో మనకున్న బాంధవ్యమును ఇతరులతో పరిపూర్ణముగా పంచుకొనే జీవితమే క్రైస్తవ జీవితము యొక్క సారాంశమైయున్నది. కృప మరియు ప్రేమ ద్వారా మార్పు చేయబడిన జీవితమునకు అది సాటిరాదు. ఎలెన్ జివైట్ ఈ విషయములో చాలా స్పష్టముగా ఆమె యొక్క అభిప్రాయమును తెలియచేసారు. వాదించడములో ఎంత చట్టబద్ధత ఉన్నను అది లోక సంబంధమైన మరియు స్వార్ధపూరితమైన జీవితాలలో మార్పు తీసుకొని రాలేదని రక్షకునికి తెలుసు. తన శిష్యులకు పరలోకమునుండి సహాయము వచ్చినపుడు మాత్రమే వారు సువార్తను హృదయాలకు తట్టే విధముగా బోధించగలరనియు అపుడు మాత్రమే కఠిన హృదయాలు మార్పు చెందునని క్రీస్తుకు తెలుసు. అపొ॥ కా॥ పుట 31. యుగయుగాల ఆకాంక్ష అనే పుస్తకములో ఆమె ఇంకా ఈ క్రింది విధముగా వ్రాసారు. "ఆశ్చర్యకరమైన క్రీస్తు యొక్క ప్రేమ హృదయాలను కరిగించి లోబరుచుకొనగలదు. కేవలము విశ్వాసము సూత్రములను బోధించుట ద్వారా ఫలితము శూన్యము తప్ప మరేమియు ఉండదు" -పుట 826.

దేవుని వాక్యములో ఉన్న సత్యములను బయటికి తీసి వాటిని గూర్చి వ్యక్తిగత సాక్ష్యముగా బోధించాలనే అభిప్రాయము కొంతమంది కలిగియుంటారు. దేవుని గూర్చిన సత్యాలను సరియైన సమయములో వాటిని గూర్చి తెలియని వారికి చెప్పుట అవసరమైనను ఎంతో ఉచితముగా యేసు నిత్య జీవమును అనుగ్రహించుట ద్వారా దానిలో మనము కనుగొనే సంతోషము, నిరీక్షణ, బలము, క్షమాపణ, దయ, సమాధానము, అపరాధ భావము నుండి పొందే విడుదల వంటి విషయాలను గూర్చి మన వ్యక్తిగత జీవిత అనుభవముతో సాక్ష్యమిచ్చుట కూడా చాలా అవసరమైయున్నది.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. ఇతరులను ప్రభావితులనుగా చేయుటకు మన వ్యక్తిగత సాక్ష్యము ఎందువలన అంత ప్రాముఖ్యమైనది? ఇతరుల సాక్ష్యములు మీ జీవితాల మీద ఎటువంటి ప్రభావమును చూపించాయి?
2. బుధవారము పాఠములోని చివరి ప్రశ్నను గూర్చి మీ సబ్బాతు బడి తరగతులలో చర్చించండి. ప్రభువులో అనుదిన అనుభవము ఎందుకవసరమైయుంది? అది కేవలము మనమిచ్చే సాక్ష్యము కొరకు మాత్రమే కాకుండా మన వ్యక్తిగత విశ్వాసము కొరకు కూడా ఎందువలన అనుదినము అవసరమైయున్నది?
3. ఒక శక్తివంతమైన సాక్ష్యము చాలా బలముగా ఇతరుల మీద పనిచేయవచ్చును. అదే సమయములో మనమిచ్చే సాక్ష్యములో దైవ భీతితో కూడిన జీవితానికి ఎందుకంత ప్రాధాన్యత ఉన్నది?
4. మీ సబ్బాతుబడి తరగతిలో వ్యక్తిగత సాక్ష్యమును వినిపించండి. దానిని ఇతరులతో పంచుకొనండి. క్రీస్తు మీకేమి చేసియున్నాడో దానిని ఇతరులతో పంచుకొనుచున్నారనియు, నేడు ఆయన మీకేమైయున్నాడనే విషయాన్ని జ్ఞాపకముంచుకొనుడి. నీ జీవితములో యేసు తీసుకొని వచ్చిన మార్పు ఏమిటి?

❋✶❋